ఇలా వచ్చి.. అలా వెళ్తున్నారు

- జమ్మికుంట ఠాణాలో విధుల నిర్వహణ సవాలేనా..!
- రెండేళ్ల కాలపరిమితిలో అర్ధంతరంగా బదిలీలు
- సమర్థవంతగా పనిచేసిన సీఐలు కొందరే
- ఇసుక, చోరీ కేసుల కట్టడిలో విఫలమే కారణమా..?
- ఫ్రెండ్లీ పోలీస్, నిబద్ధత, పారదర్శకతే శ్రీరామరక్ష


జమ్మికుంట టౌన్ పోలీస్ స్టేషన్

జమ్మికుంట: జమ్మికుంట టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధుల నిర్వహణ సవాల్‌గా మారిందా అంటే అవుననే కారణాలు వెలువడుతున్నాయి. పోలీస్ అధికారులపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో బదిలీ వేటు తప్పడం లేదు. జమ్మికుంట ఎస్‌హెచ్‌వోగా అప్‌గ్రేడ్ తర్వాత రెండేళ్ల కాలపరిమితిలో ఒకరిద్దరు సీఐలే సమర్థవంతంగా విధులు నిర్వహించినట్లు తెలుస్తోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విధుల్లో పారదర్శకత పాటించకపోవడం, అవినీతి ఆరోపణల నేపథ్యంలో నెలల వ్యవధిలోనే బదిలీ వేటు పడుతోంది. పారదర్శకత, నిబద్ధత, అవినీతికి తావులేకుండా విధులు కొనసాగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. జమ్మికుంట రూరల్ పోలీస్ స్టేషన్ జమ్మికుంట, వీణవంక, కమలాపూర్, మండలాలతో కలిపి ఉండేది. బాధితులకు సత్వర సేవలు అందించేందుకు 2010లో జమ్మికుంట రూరల్, జమ్మికుంట ఎస్‌హెచ్‌వో(టౌన్)గా అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. టౌన్ పోలీస్ స్టేషన్‌గా ఏర్పాడి 15 ఏళ్లు గడుస్తోంది.రెండేళ్ల కాలపరిమితితో సీఐగా నియామకం జరుగుతుంది. కానీ 15 ఏళ్లల్లో 15 మంది సీఐలు బదిలీ కావడం గమనార్హం .

జమ్మికుంటపై పట్టు సాధించిన సీఐగా శ్రీనివాస్‌రావుకు గుర్తింపు

జమ్మికుంట పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ స్థాయి నుంచి జమ్మికుంట రూరల్, జమ్మికుంట టౌన్ సీఐగా సుందరగిరి శ్రీనివాస్‌రావు ఆరేళ్లు విధులు నిర్వహించారు. జమ్మికుంట ప్రాంతంపై పూర్తి అవగాహన కలిగి ఉన్న పోలీస్ అధికారిగా పేరుంది. మవోయిస్టుల ప్రాబల్యం ఉన్న నాటి నుంచి నేటి జమ్మికుంట ఎస్‌హెచ్‌వో(టౌన్) ఏర్పాటు అయిన తర్వాత మొదటి ఎస్‌హెచ్‌వోగా రెండేళ్ల కాలపరిమితికి మించి విధులను సమర్థవంతంగా నిర్వహించారు. అనంతరం హుజూరాబాద్ డివిజన్ ఏసీపీగా కొనసాగి బదిలీపై వెళ్లి ఇటీవల డీసీపీగా పదోన్నతి పొందారు.

రెండేళ్లకుపైగా పనిచేసిన సీఐలు

1) సుందరగిరి శ్రీనివాస్‌రావు 2010–2012 వరకు 26 నెలలు
2) ప్రశాంత్‌రెడ్డి 2016–2018 వరకు 27 నెలలు
3) కె. సృజన్‌రెడ్డి 2018– 2021 వరకు 34 నెలలు
4) కె. రామచంద్రర్‌రావు 2021– 2023 వరకు సుమారు 23 నెలలు

నెలలు, ఏడాది వరకు పని చేసిన సీఐలు

1) ఎల్. వెంకటేశ్వర్లు 2012– 2013 వరకు 11 నెలలు
2) భూమయ్య 2013లో సుమారు 7 నెలలు
3) బాలస్వామి 2013–2014 వరకు 8 నెలలు
4) సీహెచ్ శ్రీనివాస్‌జి 2014–2016 వరకు 15 నెలలు
5) బార్పటి రమేశ్ 2023–2024 వరకు 10 నెలలు
6) వరంగంటి రవి 2024– 2025 వరకు 15 నెలలు

మరికొందరు ఒకటి, రెండు నెలలు మాత్రమే విధులు నిర్వహించారు.



2010 నుంచి విధుల్లో ఉన్న అధికారులు

కట్టడి చేయాల్సిన సమస్యలు

పట్టణం, మండలంలో శాంతిభద్రతలు, పని చేయని సీసీ కెమెరాలు, ఇసుక అక్రమ రవాణా, భూ వివాదాలు, చోరీలు, ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాలు వంచి సమస్యలు అనేకం ఉన్నాయి. రాజకీయ నాయకుల పైరవీలతో వచ్చే మరిన్ని చిక్కులు నూతనంగా బాధ్యతలు స్వీకరించే టౌన్ సీఐకి సవాల్‌గా మారనున్నాయి.



ఇల్లందకుంట: మండలంలోని రాచపల్లి–జమ్మికుంట మండలం నాగంపేట గ్రామాల మధ్యలోని లో లెవల్ కల్వర్టు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ఏళ్ల క్రితం నిర్మించడంతో కల్వర్టు రక్షణ గోడలు ధ్వంసమయ్యాయి. కల్వర్టు కుంగడంతో వాహనదారులు ప్రమదాలబారిన పడుతున్నారు. వర్షాకాలంలో కల్వర్టు పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించినప్పుడు ఇరు గ్రామాల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. హైలెవల్ వంతెన నిర్మించకపోయిన కనీసం ఉన్న వంతెనకు సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
బాపురెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ, సెల్: 9440818421

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

క్లుప్తంగా

రూ.30 వేలు విలువ చేసే సామగ్రి అందజేత


మురళిగౌడ్‌ను సన్మానిస్తున్న తిరుపతిరెడ్డి

చిగురుమామిడి: మండల కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహించే చిడతల రామాయణ కళాకారులకు జీహెచ్ఎంసీ మాజీ కార్పొరేటర్ గుర్రం మురళిగౌడ్ రూ.30 వేల విలువ గల సామగ్రిని అందజేశారు. శుక్రవారం చిగురుమామిడిలోని గాంధీ చౌరస్తాలో రామాయణ నాటక ప్రదర్శనను మురళిగౌడ్ ప్రారంభించారు. ప్రతి ఒక్కరు గ్రామీణ కళలను ప్రోత్సహించాలని కోరారు. ఈసందర్భంగా మురళిగౌడ్‌ను పలువురు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి, కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంరయ్య, మండల అధ్యక్షుడు మల్లి కార్జున్‌రెడ్డి, కళాకారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

టీషర్టులు పంపిణీ

చొప్పదండి: పట్టణంలోని ఎనిమిదో వార్డు క్రికెట్ క్రీడాకారులకు మాజీ వార్డు కౌన్సిలర్ రాజన్నల ప్రణీత ఆధ్వర్యంలో శుక్రవారం టీషర్టులు పంపిణీ చేశారు. చొప్పదండి ప్రీమియర్ లీగ్‌ను పురస్కరించుకొని ఏటా టీషర్టులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజన్నల రాజు, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి కూలిన ఇల్లు



శంకరపట్నం: మండలంలోని ధర్మారం గ్రామంలో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి దేవునూరి సదయ్య అనే వ్యక్తి ఇల్లు కూలింది. రెండు రోజుల క్రితం సదయ్య ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వీణవంక మండలం చల్లూర్‌లో బంధువుల వివాహానికి వెళ్లి శుక్రవారం ఇంటికి వచ్చారు. ఇల్లు కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది.

బస్సు ఢీకొని వృద్ధురాలికి గాయాలు

హుజూరాబాద్: రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటన మున్సిపల్ పరిధి బోర్నపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన రాజమ్మ రోడ్డు దాటుతుండగా హుజూరాబాద్ నుంచి హుస్నాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. రాజమ్మకు తీవ్ర గాయాలు కాగా హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి, వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు కుటుంబ సభ్యులు తరలించారు.

టాటా ఏస్ ఢీకొని..

చిగురుమామిడి: మండలంలోని సీతారాంపూర్ క్రాసింగ్ వద్ద శుక్రవారం సాయంత్రం హుస్నాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న బైక్‌ను కరీంనగర్ నుంచి హుస్నాబాద్ వెళ్తున్న టాటా ఏస్ ఢీకొట్టడంతో మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లికి చెందిన శివరాత్రి శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో శ్రీనివాస్‌ను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వాహనాలను స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నల్లపోచమ్మతల్లి నాటక ప్రదర్శన

మానకొండూర్: గన్నేరువరం మండలంలోని గునుకుల కొండాపూర్‌లో శనివారం, ఆదివారం నల్లపోచమ్మ తల్లి నాటక ప్రదర్శన నిర్వహించనున్నామని నల్లపోచమ్మ కమిటీ అధ్యక్షుడు జాగిరి శ్రీనివాస్ గౌడ్ ఆహ్వాన కమిటీ చైర్మన్ లింగంపల్లి తిరుపతి ప్రధాన కార్యదర్శి న్యాలపట్ల శంకర్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. 41 రోజుల దీక్షతో నాటక ప్రదర్శన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నాటక ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సోమవారం పోచమ్మ తల్లికి ఒడిబియ్యం సమర్పణ ఉంటుందని, కనుమరుగవుతున్న కళలను కాపాడుకోవడానికి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

హనుమాన్ స్వాములకు భిక్ష

మానకొండూర్: గన్నేరువరం మండలంలోని హనుమాన్ దీక్ష స్వాములకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం (భిక్ష) అన్నప్రసాద వితరణ కార్యక్రమం మైలారంలోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో చేపట్టారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల హనుమాన్ దీక్ష స్వాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మామిడాలు నాగసాయి శర్మ ప్రత్యేక పూజలు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


చిగురుమామిడి: బడిబాటలో భాగంగా బొమ్మనపల్లిలో ఈజీఎస్ కూలీలతో మాట్లాడుతున్న టీచర్లు

హుజూరాబాద్: మండలంలోని సిర్సపల్లి గ్రామంలో ఉపాధి కూలీలకు ప్రభుత్వ పాఠశాలలోని సదుపాయాలు, బోధన తీరుపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు.హెచ్ఎం వీడెపు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని, సకల సదుపాయాలు ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కారోబార్ రాజిరెడ్డి, ఫీల్డ్‌అసిస్టెంట్ వనజ, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రజని, ఉపాధ్యాయులు ఉన్నారు.

శంకరపట్నం: పిల్లలను సర్కార్ బడికి పంపాలని వెంకటేశ్వర్లపల్లి హెచ్ఎం కోటేశ్వర్‌రావు ప్రచారం చేశారు. బడిబాటలో భాగంగా బోధన తీరు, ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలను వివరించారు. అనంతరం ప్రైవేటు స్కూళ్లకు వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.

చిగురుమామిడి: ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్య లభిస్తోందని, ప్రభుత్వం ప్రతి విద్యార్థికి యూనిఫాంతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ సరఫరా చేస్తోందని, పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించొద్దని మండల విద్యాధికారి పావని కోరారు. శుక్రవారం మండలంలోని బొమ్మనపల్లిలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఊరచెరువులో పనిచేస్తున్న ఈజీఎస్ కూలీల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. అధిక ఫీజులు చెల్లిస్తూ ప్రైవేటు స్కూళ్లకు పంపించొద్దన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్‌రావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు బడుకోలు దేవేందర్‌రెడ్డి, గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


హుజూరాబాద్: సిర్సపల్లి గ్రామంలో..

సంక్షిప్త వార్తలు

మున్సిపల్ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

హుజూరాబాద్: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు చేశారు. కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ.. కార్మికుల ఆరోగ్య రక్షణ ప్రథమ బాధ్యతగా మున్సిపాలిటీ స్వీకరించిందన్నారు. కార్మికులు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్య పరీక్షల అనంతరం కార్మికులు మందులు పంపిణీ చేశారు.

సామాజిక వివాహాలను ప్రోత్సహించాలి

చిగురుమామిడి: విద్యావంతులు, మేధావులు సామాజిక వివాహాలను ప్రోత్సహించాలని జంబుద్వీప జనజాగృతి సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్ రమేశ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో జనజాగృతి సంఘం ఆధ్వర్యంలో బెజ్జంకి శ్రీమ, కన్నం చందుమహారాజ్ సామాజిక వివాహాన్ని ఘనంగా నిర్వహించారు. కుల వ్యవస్థతో అణచివేత నేటికి కొనసాగుతోందని, మూఢనమ్మకాలు, పండుగలతో అనవసర ఖర్చులతో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు తల్లడిల్లిపోతున్నారని పేర్కొన్నారు. జంబూద్వీప జనజాగృతి ఆధ్వర్యంలో స్వేచ్ఛ సమానత్వం, సోదరభావం విలువలతో సామాజిక వివాహాలు నిర్వహిస్తున్నామని, మహనీయుల సాక్షిగా ప్రమాణపత్రాలను చదివించి నూతన వధూవరులను ఒక్కటి చేస్తున్నామని వివరించారు.

హిందూ ఏక్తాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

మానకొండూర్: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని 22న కరీంనగర్‌లో నిర్వహించే హిందూ ఏక్తాయాత్రకు గన్నేరువరం మండలంలోని అన్ని గ్రామాల నుంచి హిందువులు అధిక సంఖ్యలో తరలి రావాలని బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం కాసింపేట మానసాదేవి ఆలయంలో హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు.

ఉపాధిహామీ పథకం నిర్వీర్యం

మానకొండూర్: ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్ శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మంజంపల్లి గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పనిచేసి 8 వారాలైనా కూలీ డబ్బులు పడటం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. అనేక పోరాటాలతో ఉపాధి హామీ పథకం వచ్చిందని, కూలీలకు వెంటవెంటనే డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలన్నారు. మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కూలీలకు సమ్మర్ అలవెన్సులు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు.

రంగస్థల కళాకారుడికి నటకిరిటీ అవార్డు

మానకొండూర్: ప్రపంచ సాహితీ సంబరాల్లో భాగంగా కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఖాదర్‌గూడెం గ్రామానికి చెందిన రంగస్థల కళాకారుడు పొలవేని సంపత్ యువకీర్తి నటకిరిటీ అవార్డు అందుకున్నారు. ఈ నెల 10, 11 వ తేదీల్లో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలను ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూర్‌లో అంతర్జాతీయ సంస్థ శ్రీశ్రీ కళావేదిక సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో కవులు, కళాకారులు, సాహితీ వేత్తలు సంబరాల్లో పాల్గొన్నారు. సంపత్ రావణబ్రహ్మ వేషధారణలో అభినయం ప్రదర్శించి పలువురి మన్నన పొందారు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న రంగస్థల నటుడు సంపత్‌ను గ్రామస్తులు, తోటి కళాకారులు అభినందించారు.

కేసు నమోదు

జమ్మికుంట: ఇతర మతస్తులకు వ్యతిరేకంగా వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్న వ్యక్తిని గుర్తించి శుక్రవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రామకృష్ణ రాత్రి తెలిపారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ముస్లింలను కించపరిచే విధంగా స్టేటస్ పెట్టుకోవడం గుర్తించామన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి


చిగురుమామిడి: వానాకాలం సాగుకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉంచాలని మానకొండూర్ డివిజన్ వ్యవసాయశాఖ ఏడీఏ ఎస్ శ్రీధర్ కోరారు. శుక్రవారం చిగురుమామిడి రైతువేదికలో మండలంలోని ఆయా గ్రామాల ఫర్టిలైజర్‌షాపు నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి రైతు వ్యవసాయశాఖ అధికారులు, నిపుణుల సలహాలు, సూచనలతో సాగు మొదలు పెట్టాలన్నారు. నాసిరకం మందులు వాడొద్దని, రైతులకు తప్పని సరిగా రశీదులు ఇవ్వాలని, పంటకాలం పూర్తయ్యే వరకు రైతులు రశీదులను దాచిపెట్టుకోవాలని కోరారు. లైసెన్స్ కల్గిన డీలర్ల వద్దనే రైతులు ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. మండల వ్యవసాయాధికారి రాజులునాయుడు మాట్లాడుతూ.. అవసరం మేరకు క్రిమిసంహారక మందులు స్టాక్ ఉంచుకోవాలని, కాలం చెల్లిన మందులను రైతులకు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా గ్రామాల ఏఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి


ఇల్లందకుంట: ర్యాలీలో వైద్యులు, సిబ్బంది

ఇల్లందకుంట: వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతోందని జిల్లా ఉపవైద్యాధికారి అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, హుజూరాబాద్, ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ తులసీదాస్ ఆధ్వర్యంలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లోనే డెంగీ లార్వా దోమగా మారుతుందని, మనుషులను కుట్టడం వల్ల జ్వరం బారినపడే ప్రమాదముందని ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ప్రతాప్, సీహెచ్‌వో శ్యామల, ల్యాబ్ టెక్నీషియన్ సంజీవ్, సూపర్వైజర్లు శ్రీనివాస్, విజయ, బాల శౌరి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలో వావిలాల పీహెచ్‌సీ డాక్టర్ రాజేశ్ ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా జమ్మికుంట వీధుల్లో శుక్రవారం వ్యాధి నిర్మూ లనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డ్రై డే, పరిసరాల శుభ్రత పాటించాలని, డెంగీ నివారణ బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు ఫర్హానుద్దీన్, సంధ్యారాణి, కార్తీక్, సంధ్య, చందన, మహోన్నత పటేల్, హిమబిందు, విజయ్‌కుమార్, హెల్త్ ఎడ్యూకేటర్ మోహన్‌రెడ్డి, సుపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


జమ్మికుంట: ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

అర్హులకు ఇళ్లు కేటాయించాలని నిరసన


వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు


సీపీఐ శంకరపట్నం మండల నూతన కమిటీ

హుజూరాబాద్: పట్టణంలోని గణేశ్‌నగర్‌లో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీ నేపథ్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ర్యాలీ వద్దకు వచ్చి తహసీల్దార్ కనకయ్య నాయకుల నుంచి వినతిపత్రం స్వీకరించారు. నెల రోజుల్లో ఇళ్ల సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడారు. ఇళ్లను గత ప్రభుత్వం పంపిణీ చేయకపోగా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌కు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, నెల రోజుల్లో ఇళ్లను అర్హులకు పంచకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. నిరసనలో మండల కార్యదర్శి గోవిందుల రవి, నాయకులు రాజు, రాములు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పేదలకు అండగా పోరాటం

శంకరపట్నం: పేదలకు అండగా నిలబడి పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటసామి అన్నారు. మండలంలోని కేశవపట్నంలో శుక్రవారం సీపీఐ ఐదో మహాసభ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని, బీఆర్ఎస్ కుటుంబ పాలనతో ప్రజావ్యతిరేకత మూటగట్టుకొని గద్దె దిగిందన్నారు. ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, రాజీవ్ యువవికాసం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ శంకరపట్నం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా రెండోసారి పిట్టల సమ్మయ్య ఎన్నికైనట్లు జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి తెలిపారు. సహాయ కార్యదర్శిగా కన్నం సదానందం, కోశాధికారిగా బాదుల్లా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోయిని అశోక్, పిట్టల సమ్మయ్య, లక్ష్మణ్, మల్లమ్మ పాల్గొన్నారు.

ప్రధాని మోదీపై అనుచిత పోస్టులు.. కేసు నమోదు

రామడుగు: ప్రధాని నరేంద్ర మోదీపై రామడుగుకు చెందిన ఎండీ ముజాహిద్ సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టారని చట్టప్రకారంగా చర్యలు తీసుకోవాలని శుక్రవారం బీజేపీ రామడుగు మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో ట్రైనీ ఎస్సై సతీష్‌కు ఫిర్యాదు చేశారు. ముజాహిద్‌కు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు, మండలంలోని పలు గ్రామాల మసీదుల్లో విదేశీయులు ఉన్నట్లు ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. వెంటనే విచారణ జరపాలని కోరారు. ముజాహిద్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అంతేకాకుండా ఆర్టీసీలో డ్రైవర్ పనిచేస్తున్నందున వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్‌యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పు రాంకిషన్, మాజీ అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి, నాయకులు ఉప్పు శ్రీనివాస్, బండ తిరుపతిరెడ్డి, పోచంపల్లి నరేష్, పూరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, కారుపాకల అంజిబాబు, కట్ట రవీందర్, జిట్టవేని అంజిబాబు పలువురు పాల్గొన్నారు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

కేసు నమోదు

ప్రధానిపై అనుచిత పోస్టులు పెట్టిన ముజాహిద్‌పై శుక్రవారం కేసు నమోదు చేశామని ట్రైనీ ఎస్సై సతీష్ తెలిపారు. బీజేపీ నాయకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.



విధుల నుంచి తొలగించొద్దు

శంకరపట్నం: విధుల నుంచి తొలగించొద్దని మొలంగూర్ గ్రామ పంచాయతీ ఎదుట శుక్రవారం జీపీ సిబ్బంది ఆందోళన చేపట్టారు. సుమారు 30–40 ఏళ్లుగా తండ్రుల నుంచి రూ.150 వేతనంతో పనులు చేశామన్నారు. గ్రామ పంచాయతీలో పది మంది సిబ్బంది పని చేస్తుండగా ఏడుగురిని రెగ్యులర్ చేసి ముగ్గురిని తొలగిస్తామనడం సరికాదన్నారు. కొత్త గ్రామపంచాయతీలు నల్ల వెంకయ్యపల్లి, గుడాటిపల్లికి సర్దుబాలు చేయాలని మాజీ సర్పంచ్ భర్త మోరె శ్రీనివాస్ అధికారులకు సూచించారు. ఆందోళనకు మద్దతు తెలుపుతూ ఏళ్లుగా పని చేస్తున్న సిబ్బందిని తొలగించవద్దన్నారు.